## ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజల సమస్యలను వింటున్న ఎస్‌పి

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కెకెఎన్. అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో బాధితులతో స్వయంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

# కమలాపురం ఎమ్మెల్యే ఓ భూకబ్జాకోరు!

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

**బహిరంగ సభలో నారా లోకేష్**
**1500 కిలోమీటర్ల శిలాఫలకం ఆవిష్కరణ**

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఓ భూ కబ్జాకోరని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 117 రోజుకు చేరుకుంది. సోమవారం మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలంలోని చెన్నూరుమీదుగా విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై కమలాపురం నియోజకవర్గంలోకి చెన్నూరు మండలంలోకి ప్రవేశించింది. కొండపేట, చెన్నూరు, ఉప్పరపల్లి క్రాస్, రామనపల్లి క్రాస్, చిన్నమాచుపల్లి, శేషయ్యగారిపల్లి మీదుగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఇర్కాన్ సర్కిల్, ఆలంఖాన్‌పల్లి వద్ద 1500 కిలోమీటర్లకు పాదయాత్ర చేరిక సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరించారు. వినాయక్‌నగర్ జంక్షన్, కడప శివారు బిల్డప్ సర్కిల్ విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, రైతులు, ముస్లింలు, దివ్యాంగులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఇసుక, మట్టి, గ్రావెల్ దందా, భూకబ్జాలకు కమలాపురాన్ని కేర్ ఆఫ్ అడ్రస్‌గా మార్చేసాడన్నారు. కొందరికి తాగుడు అంటే వ్యసనం మరి కొందరికి జూదం వ్యసనం ఎమ్మెల్యేకు మాత్రం భూకబ్జాలు అంటే వ్యసనమని తెలిపారు. పూర్వం బకాసురుడు ఊరికి బకబకతిన్నట్లుగా రవీంద్రనాథ్‌రెడ్డి పేదలు, ప్రభుత్వ, చివరికి శ్మశాన భూముల్ని సైతం కబ్జా చేస్తున్నాడని విమర్శించారు. కడప టౌన్ శివారు ప్రాంతంలో రూ.200 కోట్ల విలువ చేసే 54 ఎకరాల భూమిని కొట్టేసాడన్నారు. ఇప్పుడు అక్కడ వెంచర్ వేసి సెంటు రూ.13 లక్షలకు అమ్మేస్తున్నాడని తెలిపారు. లేపాక్షి భూములు లేపేయడానికి భారీ స్కెచ్ వేసాడన్నారు. రూ.20 వేల కోట్లు విలువైన 9 వేల ఎకరాల భూమిని చీప్‌గా రూ.500 కోట్లకు కొట్టేయడానికి ఒక కంపెనీలో కొడుకుని డైరెక్టర్‌గా చేర్చాడన్నారు. సర్వారాయ ప్రాజెక్టు సమీపంలో 400 ఎకరాలు ఆక్రమించి చేపల చెరువులు, పండ్ల తోటలు వేసాడన్నారు. వల్లూరు మండలం గోటూరు వద్ద రూ.100 కోట్ల విలువ చేసే పీర్ల మాణ్యం కబ్జా చేశారని తెలిపారు. కడప నగరంలోని మామిళ్ళపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 39, 60లో సుమారు రూ.130 కోట్లు విలువ చేసే 18 ఎకరాల భూమి కబ్జా చేశారన్నారు. వల్లూరు రెవెన్యూ ఆఫీస్ సమీపంలో రూ.7 కోట్లు విలువ చేసే భూమి కబ్జా చేశారన్నారు. కడప నగర శివార్లలో జయరాజ గార్డెన్ వద్ద పేదలను బెదిరించి రూ.130 కోట్లు విలువ చేసే చేసే 18 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. పెండ్లిమర్రి మండలంలోని భారత పుణ్యక్షేత్రం సమీపంలో బినామీ పేర్లతో సుమారు 200 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. బుగ్గ వంకను ఆక్రమించి ఏకంగా థియేటర్ కట్టేశాడన్నారు. కడప, కమలాపురంలో ఉన్న చుక్కల భూములను కాజేస్తున్నాడని తెలిపారు. సర్వారాయ సాగర్ వలన బాగుపడింది ఇద్దరేనని జగన్, ఆయన మేనమామమేనన్నారు. పెండ్లిమర్రి, వల్లూరు, సీకే దిన్నె మండలాల్లో చెరువుల మొత్తం కొల్లగొట్టి ఆచురును కలిసి మట్టిని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని తెలిపారు. నాపై కోడిగుడ్డు వేస్తే నీ కడుపు మంట తగ్గదన్నారు. క్లైమోర్ మైన్లకే భయపడని కుటుంబం మాదన్నారు. రూ.28 కోట్లతో టిడిపి హయాంలో హజ్ హౌస్ నిర్మించామని, ఆ భవనాన్ని వాడకుండా వదిలేశారని తెలిపారు. మైనార్టీలపై జగన్‌కి ఎంత కక్ష చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలన్నారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా సిఎంని ఎందుకు నిలదీయడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పథకాలు అమలు చేయడంతో పాటు, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగస్తులను వేధిస్తున్నారని, టీచర్లను లిక్కర్ షాపుల ముందు డ్యూటీ వేసి అవమానిస్తున్నారన్నారు. వారంలో సిపిఎస్ రద్దు చేస్తా అని 200 వారాలు దాటినా పట్టించుకోలేదన్నారు. పోలీసులు దాచుకున్న జిపిఎఫ్ డబ్బు సైతం కొట్టేసారన్నారు. రాక్షసపాలనను అంతమొందిస్తేనే కడప జిల్లా వాసులకు స్వేచ్ఛ కలుగుతుందని తెలిపారు. సిఎం సొంత జిల్లాలో ప్రజల్లో తీవ్రవ్యతిరేకత, అసంతృప్తి ఉందని, కడప జిల్లాలోనూ జగన్ పనైపోయిందని పేర్కొన్నారు. జగన్‌ను నమ్ముకున్నవారే వైసిపి నుండి బయటకు వస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ జగన్‌కు కడప జిల్లాలో ఎదురుగాలి వీచిందని పేర్కొన్నారు. ఇసుక మాఫియా ధనదాహం కారణంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 61 మంది అమాయకులు బలయ్యారని, వారికి ఇంతవరకు పరిహారం అందజేయలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఇసుక ద్వారా జగన్ అండ్ కో రూ.10 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. నదుల నుంచి ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. నదీజలాలను పరిరక్షిస్తూ ఇసుక విధానాన్ని సరళీకరించి స్థానికులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

## కెసి కెనాల్‌లో పూడికతీత పనులు

ప్రజాశక్తి-చెన్నూరు

ఉపాధి పనుల ద్వారా కెసి కెనాల్ కాలువలో ఉన్న వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, గాజు పెంకులను సోమవారం ఉపాధి కూలీలతో పనులు చేపట్టినట్లు ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దగ్గరుండి ఆ పనులను చేపించారు. కెసి కెనాల్ ఆయకట్టు రైతులకు ఈ పూడికతీత పనుల ద్వారా 1750 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కెసి కెనాల్ కూడిక్తైతే పనుల కొరకు రూ.6.28 అంచనా వేసినట్లు తెలిపారు. చెన్నూరు కొత్త రోడ్డు మీద చేపల వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలు కెసి కెనాల్‌లో వేయకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు. కెసి కెనాల్‌కు నీళ్లు రాకముందే కేసీ కెనాల్ కూడికతీత పనులు పూర్తయ్యే విధంగా చూడాలని టెక్నికల్ అసిస్టెంట్ పెంచలయ్యకు, ఫీల్డ్ అసిస్టెంట్ భూషణంకు సూచించారు. చెన్నూరు నుండి గుర్రంపాడు వరకు ఈ పనులను కొనసాగించాలని, మళ్లీ కెసి కెనాల్‌కు నీరు వస్తే ఇబ్బందులు ఉంటాయని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చూడాలని ఇప్పటికే 70 మందికి పైగా కూలీలు పని చేస్తున్నారని, ఇంకా ఎక్కువమంది కూలీలను పెట్టాలని తెలియజేశారు,

## శిశు మరణాలు అరికట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో శిశు మరణాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసి గణేష్ కుమార్, వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లీ, డాక్టర్ మల్లేశ్వరి, డిఐఒ ప్రమీల, డెమో రాధాకృష్ణారెడ్డి, ఎంపిహెచ్ఇఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప

స్పందన అర్జీదారులకు వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలు నందు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తోపాటు జెసి జి.గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్ మీనా, మౌర్య భరద్వాజ్, డిఆర్వో గంగాధర్ గౌడ్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, యధుభూషణ్ రెడ్డి తదితరులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సిపివో వెంకట రావు, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, జిజిహెచ్ సూపరిడెంట్ డా.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ వీరన్న, ఎల్‌డిఎం దుర్గా ప్రసాద్, సమగ్ర శిక్ష ఎపిసి ప్రభాకర్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ రాణి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, డిసిఓ సుభాషిణి, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## జీతం ఇవ్వాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుడు శ్రీరామ్‌కు జీతం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా, నగర అధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, సుంకర రవి కోరారు. సోమవారం స్పందనలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 41వ డివిజన్‌లో ఉన్న కార్మికుడు శ్రీరామ్ డిప్యూటీ మేయర్‌ను ప్రశ్నించారని వార్డు మార్చడం దారుణమని పేర్కొన్నారు. జీతం కూడా రాకుండా చేశారని విమర్శించారు. సత్వరమే స్పందించి జీతం అందేలా చూడాలని కోరారు. యాధా స్థానంలో పనిని కొనసాగించాలని పేర్కొన్నారు. ఒకరిని వార్డు మార్చాలంటే విధి విధానం అమలు చేయాలని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. చనిపోయిన కార్మికుల కుంటుంబంలో ఒకరికి ఉద్యోగం, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ముగ్గురు సెక్రటరీలను సస్పెండ్ చేయాలన్నారు. ఎక్స్‌నోరా స్థలాన్ని కార్మికులకు ఫంక్షన్ హాలుకు ఇవ్వాలని కోరారు. మేస్త్రీలను యధా స్థానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, నాయకులు ఓబులేసు, శ్రీరామ్, దస్తగిరమ్మ, లక్ష్మి, కొండమ్మ, ధరణి, పెద్దన్న, ఓబులేసు, శివ పాల్గొన్నారు.

## చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టర్‌తో సమస్య చెబుతున్న మనోహర్

కడప నగరంలో, ప్రొద్దుటూరులో చైతన్య విద్యాసంస్థలు జిఒ నంబరు ఒకటి పాటించడం లేదని, చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య పాఠశాలలో చదివే విద్యార్థులు వీరివద్దనే పుస్తకాలు కొనాలని ఒత్తి చేస్తున్నారని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదవిన వారితో బోధన చేయిస్తున్నారని చెప్పారు. విద్యాసంస్థలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సికె దిన్నె మండలంలో 4 రెసిడెన్షియల్ స్కూల్స్ నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఐఎస్ఐ గుర్తింపు లేకుండా ఎజిఎం ఇంటి వద్ద వాటర్ ప్లాంట్ పెట్టి నీళు పంపి పిల్లల ఆరోగ్యం పాడుచేస్తూ ఆదాయం గడిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం లేదని చెప్పారు. కనీసవేతనాలు అమలు చేయడం లేదన్నారు.

## హజ్ ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అంజాద్‌బాషా

**కడప అర్బన్:** గుంటూరు జిల్లా నంబూరు అరబిక్ కాలేజీ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హజ్ క్యాంపు హౌస్ ఏర్పాటను డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

## రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

రైలు ప్రమాదం ముమ్మాటికి ప్రభుత్వం విఫలమేనని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య అన్నారు. రైలు ప్రమాదం సంఘటనపై సిబిఐ తక్షణం విచారణ జరిపించాలని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కాంగ్రెస్ పార్టీగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒరిస్సాలోని బాలాసోర్‌లో జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ కాంగ్రెస్ పార్టీగా చింతిస్తున్నట్లు తెలిపారు. ఇంత ఘోర ప్రమాదం జరగడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. రైళ్ల ప్రమాదానికి, వందల మంది మృతికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కరీం, కిషోర్, కృష్ణారెడ్డి, రత్నం పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

**కడప:** రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఆహార పంటల్లో వైవిధ్యాన్ని తీసుకురావచ్చునని అర్థశాస్త్ర విభాగాధిపతి కె.శివరాం అన్నారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిరుధాన్యాల సాగు, వినియోగ ఆవశ్యకతను తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.విజయ్ కుమార్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు చక్రవర్తి, హిందీ అధ్యాపకులు డాక్టర్ రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్‌కు సత్కారం

**కడప అర్బన్:** జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.వి.ఎన్.బాబును వైసిపి సీనియర్ నాయకులు పెనుబాల విజయ్ కుమార్ పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. సోమవారం రిజిస్ట్రార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రిజిస్ట్రార్‌తో పెనుబాల విజయ్‌కుమార్

# ఖరీఫ్ సాగుకు నిరీక్షణ!

- 1,92,762 ఎకరాలతో సాగు లక్ష్యం
- జిల్లాలో 83,037 ఎకరాల్లో వరి
- 53,915 ఎకరాల్లో పత్తి
- పెట్రో ధరలతో ఆందోళన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. ఖరీఫ్ సీజన్ వర్షాధారంపైనే ఆధారపడి ఉన్న సంగతి తెలిసిందే. జూన్ నాలుగున నైరుతి కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇటీవల మరో మూడ్రోజులు సమయం తీసుకునే అవకాశం ఉందని తెలపడంతో నిరాశ తప్పలేదు. ఇదిలాఉండగా జిల్లా వ్యవసాయశాఖ 1.92,762 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు ప్రతిపాదనలు అందజేసింది. ఇందులో 83,037 ఎకరాల్లో వరి, 14,347 ఎకరాల్లో వేరుశనగ, 53,915 ఎక రాల్లో పత్తి పంటలు సాగు కానున్నాయి. మినుములు, కందులు, పెసలు వంటి మొక్కజొన్న వంటి పచ్చిరొట్ట సాగవుతున్నాయి. జూన్ మొదటి వారం నుంచే సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. జూన్ ప్రారంభం నుంచే పొలాలను చదును చేసే పనుల్లో నిమగ్నమైన నేపథ్యంలో కథనం...

జిల్లాలో పంటల సాగుకు నిరీక్షణ తప్పడం లేదు. ఈఏడాది జూన్ నాలుగున కేరళను రుతుపవనాలు పలకరించే అవకాశాలు ఉన్నాయనే ఐఎండి అంచనా తప్పింది. మరో మూడ్రోజులు రుతుపవనాల రాక ఆల స్యమయ్యే అవకాశాలు ఉన్నాయనే తాజా ప్రకటనతో జిల్లా రైతాంగం ఆశ నిరాశల మధ్య ఊగిసలాడుతోంది. పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు గుబులు పుట్టిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్య ంలో జిల్లా వ్యవసాయశాఖ సాగు ప్రణాళికను రూపకల్పన చేసింది. ఆమే రకు 2023-24 సంవత్సర ఖరీఫ్ ప్రణాళిక 1.92,762 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు సిద్ధమైంది. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయశాఖకు ప్రణాళికను అందజేసింది. ఈమేరకు 1,81,915 లక్షల ఎకరాల్లో సాధారణ సాగుకు ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధాన పంటలైన వరి 83,037 ఎకరాలు, వేరుశనగ 14,347 ఎకరాలు, 53,915 ఎకరాల్లో పత్తి పం టల సాగుకు రంగం సిద్ధమైంది. మిగిలిన సిరి ధాన్యాలు, ఆయిల్‌సీడ్స్ జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి 43,276 ఎకరాల్లో సాగు కానున్నాయి. ఇదిలాఉండగా జిల్లాలో సాగు వనరులైన విత్తనం, ఎరువులు, పురుగు మందుల పంపిణీకి వ్యవసాయశాఖ రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ 12 వేల క్వింటాళ్ల మేరకు విత్తన ప్రతిపాదనలు అందజేసింది. రాష్ట్ర వ్యవసాయశాఖ 11,784 క్వింటాళ్ల విత్తనాలను మం జూరు చేసింది. ఇందులో జిల్లాలోని 432 ఆర్‌బికెల పరిధిలో 10,530 మంది రైతులు 3,094 క్వింటాళ్ల విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 7,942 మంది రైతులకు 2,400 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేసింది. ఈనేపథ్యంలో జిల్లా రైతాంగం దుక్కులు దున్నుకుని పొలాలను చదును చేసుకుని విత్తనం వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఏదేమైనా జిల్లాలో ఖరీఫ్ సాగుకు రుతుపవనాల దోబూచులాట నేపథ్యంలో రైతాం గం ఊగిసలాడుతోంది. దీనికితోడు పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరల నేపథ్యంలో పంటల సాగుకు పెట్టుబడి రెట్టింపు కానుందనే ఆందో ళన నెలకొంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవసాయ ఉపకర ణాల ధరల తగ్గుదలతోపాటు పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగు మం దుల ధరలను తగ్గించి, సాగుకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉం దనడంలో సందేహం లేదు.

# శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం : జెవివి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జెవివిలో సభ్యులుగా చేరాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం రవీంద్ర నగర్ లోని జెవివి కార్యాలయంలో శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరండి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రచార ఉద్యమంలో 35 సంవత్సరాల ప్రస్థానం గల జన విజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పనిచేస్తూ ఉండదని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడి.దేవదత్తం మాట్లాడుతూ మనిషి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునే శక్తి మనిషికే ఉందన్నారు. మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరిచే శక్తులు, అడ్డుకునే శక్తులు, సామాజిక వ్యవస్థలో ఉన్నాయని చెప్పారు. అలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం చేస్తున్నది జన విజ్ఞాన వేదికన్నారు. అనేక రంగాలలో మునుపెన్నడూ ఊహించని మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్త సైన్స్ కళాజాతాలను స్వతంత్రంగా జయప్రదంగా నిర్వహించిందని తెలిపారు. తెలుగు ప్రజల భావ విప్లవ పైతాలికుడు కందుకూరి "ప్రస్తుతం పాత క్రొత్తల మధ్య, సత్యాసత్యముల మధ్య పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జనవిజ్ఞాన వేదికలో సభ్యులై ప్రజాసైన్స్ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు వెంకటరామరాజు, సమీర్‌బాషా, శ్రీరాములు, ఆరోగ్య విభాగం కమిటీ కన్వీనర్ డాక్టర్ చక్రధర్, నగర కమిటీ అధ్యక్షులు అబ్బాస్ వల్లి, జిల్లా కార్యదర్శి రాజేష్, నగర్ కమిటీ కార్యదర్శి కరీముల్లా పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

**కాశినాయన:** మండల కేంద్రం చుట్టూ ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయొద్దనే జిఒను రద్దు చేసి వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ బంజర భూమిని అర్హత గల పేదలకు వెంటనే పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు వీరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన కాశినాయన మండలంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ జిఒ భూ కబ్జాదారులకు ఉపయోగపడుతుందని దీనివల్ల పేదలు ఎంతో నష్టపోతున్నారని పేర్కొన్నారు. సాగులో ఉన్న భూములు కూడా పటా ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇలాంటి జిఒలు పెట్టడం వల్ల భూ కబ్జాదారులకు ఉపయోగపడుతుంది తప్ప ప్రభుత్వానికి కానీ పేద ప్రజలకు ఎలాంటి ఉపయోగ ఉండదని పేర్కొన్నారు. ఇప్పటికే ఎక్కడ ఖాళీ స్థలం ఉన్న ఎక్కడ బంజర భూమి ఉన్న అధికార పార్టీ వాళ్లు కబ్జా చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మండలంలోని నాయనపల్లె పొలంలో దాదాపు 150 ఎకరాల భూమిని అధికార పార్టీ నాయకులు చదును చేస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

## యువతికి రక్తదానం

**పోరుమామిళ్ల టౌన్:** మండలంలోని సిద్ధవరం గ్రామానికి చెందిన శామల అనే యువతి పోరుమామిల్లలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చేరింది. హాస్పిటల్ సిబ్బంది ఓ పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలిపారు. పేషెంట్ బంధువులు రక్తం కోసం ప్రయత్నం చేయగా చివరి క్షణాల్లో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించి పోరుమామిళ్ల కు చెందిన అఖిల్‌చే ఓ పాజిటివ్ రక్త దానం చేయించారు. కార్యక్రమంలో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు అఖిల్ హాస్పిటల్ లాబ్ సిబ్బంది కేశవ పాల్గొన్నారు.

## బదిలీల్లో అన్ని ఖాళీలు చూపించాలి : యుటిఎఫ్

**కాశినాయన:** ఉపాధ్యాయ బదిలీలలో ఖాళీగా ఉన్న స్థానాలను బ్లాక్ చేయకుండా అన్నింటిని చూపాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలసపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లెలోని యుటిఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కన్నా జోజయ్య నివాసంలో మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలను హడావుడిగా నిర్వహిస్తూ అసంబద్ధంగా ఖాళీలను బ్లాక్ చేసి ఉపాధ్యాయులను గందరగోళంలోనికి గురిచేస్తుందని పేర్కొన్నారు. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి సమక్షంలో ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చల్లో ఖాళీలను బ్లాక్ చేయమని ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపి ప్రస్తుతం అధికారులు అందుకు విరుద్ధంగా బదిలీల నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్ని ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను బ్లాక్ చేయకుండా చూపించి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కుర్ర చెన్నయ్య, కెవి సుబ్బారెడ్డి, జోజయ్య పాల్గొన్నారు

## ప్రిన్స్ వంజాకు ఘన సన్మానం

**కడప:** స్వర్గీయ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 75వ జయంతిని విశాఖ సింగర్స్ పాయింట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సందర్భంగా సంగీత దర్శకుడు ప్రిన్స్ వంజాకు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులురెడ్డి ప్రభ, సత్య పైల, నిర్మల, రామకృష్ణ, వీరేష్, రాధాశంకర్, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రిన్స్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

## రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



తహశీల్దార్ గంగయ్యను సన్మానిస్తున్న డీలర్లు

**పోరుమామిళ్ల టౌన్:** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ గంగయ్యను పోరుమామిళ్ల మండల రేషన్ డీలర్లు మర్యాద పూర్వని కలిసి శాలువా, పూలదండతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రేషన్ డీలర్‌లు రేషన్ ప్రతి నెల సక్రమంగా పంపిణీ జరపాలని, ఎటువంటి సమస్యలు తలెత్తున తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రింటింగ్ పేపర్ ఇబ్బదులు, కొన్నిసార్లు సర్వ ప్రాబ్లం మాత్రమే చోటు చేసుకుంటున్నాయని పంపిణీలో ఏ విధమైన ఇబ్బందులు లేవని రేషన్ డీలర్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, ఉపాధ్యక్షులు అల్లూరయ్య, నాగ సుబ్బయ్య, ఎమ్.ప్రసాద్, డి.ప్రసాద్, బాబు, జయరామిరెడ్డి, సంగా వీరయ్య పాల్గొన్నారు.

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**పోరుమామిళ్ల టౌన్:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అంజుమన్ కమిటీ అధ్యక్షులు రాజీవ్ బాష అన్నారు. మే నెల 8వ తేదీ నుండి పోరుమామిళ్లలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆఫ్రిద్ ఆధ్వర్యంలో జరుగుచున్న సమ్మర్ క్యాంపును ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజీవ్ బాష మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడం హర్షణీయమన్నారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవరుచుకోవాలని సూచించారు. గ్రంథాలయములో విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్న పలురకాల పుస్తకాలను చదివి విజ్ఞాన వంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్య వర్గసభ్యులు దాదాపీర్, ఖాసీమ్ వల్లి, పాఠకులు కైసర్ బాష, ఖదీర్, మోక్షిత, మున్వర్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

**కలసపాడు:** మండలంలోని గోపవరంపల్లె అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో అసలైన విద్యను అందిస్తున్నారని, గ్రామ సచివాలయ మహిళా శిశు సంరక్షణ అధికారి ఎం.ఆనిమ అన్నారు. సోమవారం సచివాలయ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆమె చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థికి కావలసిన ఆటపాటలే కాకుండా, మంచి పౌష్టికాహారం కూడా ఉంటుందని, తల్లులకు వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్రతినెలా అందిస్తున్నారని తెలిపారు. చిన్నారుల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రతి విషయాన్ని రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన పాలు గుడ్లను పరిశీలించి తీసుకోవాలని తెలిపారు. అనంతరం మహిళలకు పోషణ, గుడ్లు, అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్.నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

## గుడ్డ బ్యాగులు పంపిణీ

**కడప:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్, జంతు శాస్త్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గుడ్డ సంచుల పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని చాలా వరకు నియంత్రించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై.సావిత్రి జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రవి శేఖర్, అధ్యాపకులు కృష్ణవేణి, నరసింహారావు, అనిత, శివ పార్వతి, రాజేశ్వరి, హరి ప్రసాద్, సబితా పర్వీన్ పాల్గొన్నారు.

గుడ్డ బ్యాగులను పంపిణీ చేస్తున్న అధికారులు

## వాలంటీర్ల సేవలు ఎనలేనివి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్ల సేవలు ఎనలేనివని, వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ షాహిద్ అన్నారు. పట్టణ పరిధిలోని 7వ సచివాలయం పరిధిలోని 17 మంది వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. స్థానిక కౌన్సిలర్లు జంషీద్, హేమలత ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ప్రశంసాపత్రాలతోపాటు రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానించి, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్ఎస్ షాహిద్

## ఎస్ఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పులివెందుల అర్బన్ ఎస్ఐగా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ కొండాపురం నుంచి బదిలీ అయ్యారు.

## అసత్య ఆరోపణలు తగవు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

పట్టణంలో చికెన్ వ్యాపారస్తులతో కుమ్మక్కై, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వైసిపి నాయకులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు యువగళం బహిరంగ సభలో నారా లోకేష్ ఆరోపణలను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లా జానీ తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని గూడు మస్తాన్ దర్గా ఆవరణలో సోమవారం ముల్లా జానీ చన్నీటి స్నానం చేసి అల్లాపై ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగానీ, వైసిపి నాయకులకుగానీ చికెన్ వ్యాపారులు, ఫిల్టర్ వాటర్ నిర్వహణలో ఎలాంటి ముడుపులు లేవన్నారు. తమపై అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. టిడిపి నాయకులు దిగజారుడు ఆరోపణలు చేసి ప్రజల్లో చులకన కావద్దని హితవు పలికారు. స్థానిక పలగాడి సర్కిల్‌లో టిడిపి నాయకులు చికెన్ వ్యాపారం చేస్తున్నారని, వారు కూడా అధిక ధరకు చికెన్ విక్రయిస్తున్నారని తెలిపారు. వారి నుండి తెలుగుదేశం నాయకులకు ముడుపులు అందుతున్నాయా అని ప్రశ్నించారు. దేవగుడి గ్రామంలో చికెన్ ధరలు జమ్మలమడుగు పట్టణం కంటే రూ.20 అధికంగా ఉన్నాయని, వారి వద్ద నుండి ఎవరు మామూళ్లు వసూలు చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రెండవ వార్డ్ కౌన్సిలర్ నూర్జహాన్, 18వ వార్డు కౌన్సిలర్ గౌరీనాథ్, వైసిపి నాయకులు బేపారి షామీర్ అలీ, సద్దాం, అక్రమ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముల్లా జానీ

## ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు జవాబుదారీగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఉంటున్నారని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని నిపుణులతో చర్చించి, కాలువల ఆధునీకరణ పనులకు భూమిపూజ కార్యక్రమం కూడా పూర్తయిందన్నారు. భౌగోళికంగా పట్టణానికి అండర్ గ్రౌండ్ డ్రయినేజీ అనుకూలం కాదన్నది నిపుణుల నివేదిక అన్నారు. పక్కా ఇంటి నిర్మాణానికి కేవలం 400 లింకులు తక్కువగా 2సెంట్లు ఇచ్చామని, ఈ 400 లింకుల తక్కువకు ఎమ్మెల్యే ప్రజలతో పత్రికా ముఖంగా క్షమాపణ కోరారని గుర్తు చేశారు. ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్టుల నియామకానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.4000 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఏడాదిలోగా స్వర్ణకారులకు చెప్పిన మేరకు ఎమ్మెల్యే ప్రయోజనాన్ని చేకూరుస్తారన్నారు. ఆక్రమణల తొలగింపుతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని, ఆ దిశగా రాచమల్లు ప్రయత్నిస్తున్నారన్నారు. లోకేష్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం తగదన్నారు. మంగళగిరిలోని ఓటమిని గుర్తించి మసలుకోవాలని పేర్కొన్నారు.

## పుల్లూరులో అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలంలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీ కొత్త పుల్లూరు గ్రామంలో అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలను గ్రామ సర్పంచు పెద్దిరెడ్డి ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, పుల్లూరు ఉపసర్పంచు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రవీం ద్రారెడ్డి, నాగిరెడ్డి, గుమ్మా సుబ్బారెడ్డి పాల్గొన్నారు. నాయకులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచు పెద్దిరెడ్డి

## ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం చేసినట్లు మై హెల్ప్ యు ఫౌండేషన్ మోరే లక్ష్మన్‌రావు తెలిపారు. స్థానిక క్యాంబెల్ హాస్పిటల్‌లో చికిత్స పొంధుతున్న నారబోయిన సాయమ్మ అనే మహిళకు బి నెగిటివ్ రక్తం అవసరం కాగా.. వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్‌ను సంప్రదించారు. ఫౌండేషన్ సభ్యులు కొంపల దామోదర్ బి నెగిటివ్ రక్తన్ని రక్తదానం చేశారు. రక్త దాత దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మే ఐ హెల్ప్ యు ఫౌం డేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, శివ సాయినథ్, సుబహాన్, సభ్యులు పాల్గొన్నారు.

రక్తం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

## శిథిలావస్థ భవనాల పనులు చేపడతాం

**- ఎపి టూరిజం శాఖ డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి**

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ టూరిజం శిథిలావస్థలో ఉన్న విశ్రాంతి భవనాలు, పార్కుల పనులు చేపడుతామని ఎపి టూరిజం శాఖ డైరెక్టర్ పోకల రామ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చామన్నారు. స్థానిక ఎపి టూరిజం శాఖలో శిథిలావస్థలో ఉన్న భవనాలను సోమవారం ఆయన పరిశీలించారు. త్వరలో పనులను చేపడతామని తెలిపారు. అనంతరం ఆయన బ్రహ్మంగారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ప్రత్యేక స్వాగతం పలికారు. పూలమాలతో సత్కరించారు. అనంతరం బ్రహ్మసాగర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో బియస్ నారాయణరెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

బ్రహ్మసాగర్‌ను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడప : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి - కడప**

ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ చర్యలు చేపట్టడం ద్వారా.. కాలుష్య కోరల నుండి పర్యావరణాన్ని ఆరోగ్యకరంగా కాపాడవచ్చుని స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ పేర్కొన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం'పై సాయి గ్రేస్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. డివిజనల్ అటవీ శాఖ అధికారి నాగార్జునరెడ్డి, కళాశాల కరెస్పాండంట్ గౌతంకుమార్‌రెడ్డి, విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ నెల్సన్, అధ్యాపక బృందం, స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బరాయుడు, సిబ్బంది జి.వి.సుబ్బారావు, వి.వి.నారాయణ, టి.నాగయ్య, జి.నాగశ్రీను పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్ అన్నారు. సోమవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ర్యాలీని కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, అటవీ అధికారి సందీప్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భరద్వాజ్, ఎపి కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాక సురేష్‌కుమార్, ఇంజనీరు జావిద్‌బాషా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు, పర్యావరణవేత్తలు, నగర ప్రజలు పాల్గొన్నారు.

-పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం.ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. కడప ఎపి టూరిజం హరిత ఫంక్షన్ హాల్‌లో కడప పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ జావిద్, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్, కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్ కిరణ్, వివిధ సిమెంట్ ఫ్యాక్టరీ కంపెనీ ప్రతినిధులు, కాలేజీ విద్యార్థులు, ఎన్జీవోలు, ప్రజలు పాల్గొన్నారు.

**కడప అర్బన్ :** పర్యావరణ సమతుల్యతకు ఓజోన్ పొర రక్షణ కవచం వంటిదని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ బి.అంజనేయ ప్రసాద్ అన్నారు. సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేషనల్ ఈవెంట్ టీమ్, జాతీయ సేవా పథక టీమ్ తో కలిసి పర్యావరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలని పురపాలక ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మునిసిపల్ కార్యాలయం నుంచి పాత ఆర్‌టిసి బస్టాండ్, వైయస్సార్ సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీని వారు ప్రారం భించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్క లను పెంచా లన్నారు. మనిషి ఆరోగ్యకరమైన మనుగడకు స్వచ్ఛమైన గాలి కావాలంటే పచ్చని చెట్లు తప్పక అవసర మన్నారు. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరు వాడరాదని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాకరాపురంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పురపాలిక వైస్ చైర్మన్ హఫీజ్, పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, అన్ని సచివాలయాల అడ్మిన్, మెప్మా సిబ్బంది, ఆనిమేటరు, లయోలా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్

**వేంపల్లె :** ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్గిచేందుకు విద్యార్థులు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజినేయులు చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు ముందడుగు వేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలపై చెప్పాలని విద్యార్థులకు సూచించారు. మొక్కలను ప్రతి ఇంటి వద్ద నాటేలా ప్రయత్నించాలన్నారు. సోలార్ ఎనర్జీని ఉపయోగించాలని చెప్పారు. అయా క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సతీష్, షఫీద్దీన్, వినోద్, జిలాన్, పీడీ తేజేంద్ర పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) :** పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్ తరుణేందు శేఖర్ అధ్యక్షతన పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సిఇ నాగరాజు, సిబ్బంది మొక్కలు నాటారు. పవర్ హౌస్ గేటు నుండి ర్యాలీగా వచ్చి సర్వీస్ బిల్డింగ్ పరిసర ప్రాంతంలో 130 మొక్కలు నాటారు. ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ యోగాంజినేయులు

# అతిసార నియంత్రణపై అవగాహన

అతిసార నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

**ప్రజాశక్తి - చాపాడు**

గ్రామాల్లో ప్రజలకు అతిసార నియంత్రణపై సిబ్బంది అవగాహన కల్పించాలని డాక్టర్ శ్రీవాణి సూచించారు. సోమవారం నుంచి ఈ నెల 17వరకు అతిసార నియంత్రణ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తున్న సందర్భంగా ఇంటెన్సీ ఫైడ్ డయేరియా కంట్రోల్ పోర్ట్ నైట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు అయిదేళ్లలోపు పిల్లలున్న ప్రతి ఇంటికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ సెంటర్లలో తప్పనిసరిగా ఒఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చాపాడు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడరాదని, మొక్కలు నాటాలని, ఆరోగ్యంగా ఉన్నవారు సంపన్నులని వివరించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఓబులేష్, డాక్టర్ కావ్య మాధురి, సిహెచ్ఒ మహదేవ్ యాదవ్, సూపర్వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేంపల్లె :** డయోరియా పట్ల అవగాహన కలిగి ఉంటే మరణాలు సంభవించవని తాళ్ళపల్లె ప్రభుత్వ వైద్యురాలు స్వాతిసాయి పేర్కొన్నారు. మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నీళ్ల విరేచనాల నివారణ దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నిషా, డాక్టర్ నిజాముద్దీన్, సిహెఒ వెంకటరత్నం, రాణి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎంపిటిసి మణిగోపాల్‌రెడ్డి, ఎఎన్ఎం లక్ష్మి దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన కమలాపురం వైసిపి నేతలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

వచ్చే ఎన్నికల్లో కమలాపురంలో గెలుపే లక్ష్యంగా టిడిపి కార్యకర్తలు పనిచేయాలని లోకేష్ అన్నారు. చెన్నముక్కపల్లి విడిది కేంద్రంలో కమలాపురం నియోజకవర్గం తప్పెట్ల గ్రామానికి చెందిన సర్పంచ్ గడికోట శాంతి, భర్త సుధాకర్‌రెడ్డి, గండిరెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచులు గాలి ప్రసాద్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, మిట్టపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, గోనుమాకపల్లికి చెందిన మాజీ ఎంపిటి శేఖర్‌రెడ్డి, అంబవరం మాజీ ఎంపిటిసి ముంతా జానయ్య, సీనియర్ నేతలు రామసుబ్బారెడ్డి, నాగేంద్ర రెడ్డి, దళిత నేతలు కొప్పుల జగన్, అనిల్, చంటితో పాటు పలువురు దళిత యువకులు టిటిపిలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పిన లోకేష్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మిట్టపల్లికి చెందిన 20 కుటుంబాలు, గంగిరెడ్డిపల్లికి చెందిన 30 కుటుంబాలు, గోనుమాకులపల్లికి చెందిన 30 కుటుంబాలు, అలిదిన, పాయసంపల్లి, పడదుర్తి, చడిపిరాళ్లకు చెందిన ఎస్సీలు, ఎస్ఆర్ నగర్, జెబి నగర్ కాలనీ, ఉప్పర్పల్లికి చెందిన 40 కుటుంబాలు, తోలగంగనపల్లికి చెందిన 8 కుటుంబాల వారితో పాటు పలువురు టీడీపీలో చేరారు.

**లోకేష్‌కు ఘన సన్మానం**

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం చెన్నముక్కపల్లె విడిది కేంద్రం నుంచి కమలాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. మండలంలో లోకేష్ పాదయాత్ర ముగింపు సందర్భంగా నాయకులు పూలమాలలతో లోకేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, ఐ టిడిపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జునరెడ్డి, పత్తూరు ఉప సర్పంచు, ఐటిడిపి సభ్యులు ముత్తూరు రమణ, శంకర్ నాయుడు, సుబ్బారెడ్డి, ధయాంఖాన్‌పల్లె నరసింహులు పాల్గొన్నారు. పాదయాత్రను జయప్రదం చేసిన నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు లక్ష్మిరెడ్డి, సందుల నాగశావారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

# వేగంగా హాకీ టర్ఫ్ మైదాన నిర్మాణ పనులు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్‌డి హర్షవర్ధన్

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పట్టణంలోని ధ్యాన్ చంద్ క్రీడామైదానంలో నూతనంగా నిర్మిస్తున్న హాకీ టర్ఫ్ మైదాన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఐఎఎస్ షాప్ ఎండి హర్షవర్ధన్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జులై 8న పులివెందులలో పర్యటించనున్నారని తెలిపారు. ఆయన చేతుల మీదుగా ప్రారంభించే విధంగా సన్నాహాలు చేయాలన్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో ఉన్న హాకీ అకాడమీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. హాకీ టర్ఫ్ కోర్ట్ అథ్లెటిక్స్ కబడ్డీ కోర్టుకు సంబంధించిన మ్యాప్ పరిశీలించారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ సిద్ధారెడ్డి, డిఇ జగదీశ్వర్‌రెడ్డి, చీఫ్ కోచ్ అమృత్‌రాజ్, స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ మొహిద్దిన్, హాకీ కోచ్ కళ్యాణ్, ఇండోర్ ఇన్‌ఛార్జి శేఖర్ పాల్గొన్నారు.

## పిల్లలను బాగా చదివించాలి : సిఐ

**కడప :** పిల్లలను బాగా చదివించాలని తాలూకా సిఐ ఉలసయ్య తల్లిదండ్రులకు సూచించారు. నగర శివారులోని సంచార జాతికి చెందిన బుడగ జంగం కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బుడగ జంగాలు ప్రజలు రాయలసీమలో ఆయా పట్టణాల్లో జీవిస్తున్నారన్నారు. ఇక్కడ మీరు అభివృద్ధి చెందలేక పిల్లలను విద్యావంతులు చేయక కులవృత్తి పేరుతో భిక్షాటన చేస్తూ పిల్లలను బాల కార్మికులుగా మారుస్తున్నారని, మంచి పద్ధతి కాదన్నారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం కూడా సరికాదన్నారు. మీ వృత్తికి విరుద్ధంగా చెత్త కాగితాల పేరుతో మహిళలు అర్ధరాత్రి వీధుల్లో సంచరిస్తున్నారన్నారు. ఇక నుంచి అలా చేయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐలు రామకృష్ణ, హుస్సేన్, ఎఎస్ఐలు సుబ్బరాయుడు, మల్లయ్య, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## బస్టాండ్ నిర్మించాలని వినతి

**ప్రజాశక్తి - దువ్వూరు**

మండల కేంద్రమైన దువ్వూరులో బస్టాండ్ నిర్మించాలని స్థానిక మారుతీనగర్ వాసులు సోమవారం స్పందన కార్యక్రమంలో కోరారు. ఆ మేరకు మండల ప్రత్యేకాధికారి ఓబులేస్ సందన్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ మైదానంలో ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. తహశీల్దార్ రమాకుమారి మాట్లాడుతూ రైతులు, విద్యార్థుల అర్జీలను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు

వినతి పత్రమిస్తున్న ప్రజలు

## పచ్చిరొట్ట ఎరువులకు రిజిస్ట్రేషన్

**ప్రజాశక్తి - చాపాడు**

పచ్చిరొట్టకు అవసరమైన జీలుగలు, జనుములు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీలుగలు ఎకరాకు కిలోలు ధర రూ.395, జనుములు ఎకరాకు 10కిలోలు ధర రూ.420 అందిస్తామన్నారు. రైతులు ఆధార్‌కార్డు, భూమి పాస్‌బుక్,సెల్‌ఫోన్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. పేరు నమోదు ఈనెల 9వరకు చేస్తామన్నారు. 10న జీలుగలు, జనుములు ఇస్తామన్నారు.

## 'కుట్టుమిషన్ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోండి'

**- పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

కుట్టుమిషన్‌లో ఉన్న ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆదిత్య బిర్లా మెగా జాబ్ మేళాలో భాగంగా ఆదిత్య గార్మెంట్స్‌లో మహిళలకు కుట్టుమిషన్‌కు సంబంధించి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 8న ఉదయం మున్సిపల్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే మహిళలు 18 సంవత్సరాల నుంచి 32 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తోపాటు వ్యక్తిగత వివరాలు తీసుకొని రావాలన్నారు. అనుభవం లేకపోయినా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చన్నారు. ఉద్యోగానికి వెళ్లడానికి పట్టణం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

## రైతులను మభ్యపెట్టడం సరికాదు

**ప్రజాశక్తి - చాపాడు**

పసుపు కొనుగోలు కేంద్రాలు కేవలం రైతులను మభ్య పెట్టేందుకే తెరిచినట్లు ఉన్నాయని రైతు సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు ఎవి రమణ, నియోజకవర్గ నాయకులు ధనపాల యుగంధర్ పేర్కొన్నారు. మైదుకూరు మార్కెట్ యార్డ్‌లో సోమవారం వారు రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మూడు రోజులు అవుతావున్నా.. ఏ ఒక్క రైతు నుంచి కూడా కిలో పసుపును కూడా అధికారులు కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వం పెట్టిన షరతులతో రైతులు పసుపును అమ్మేస్థితిలో లేరన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు ద్వార్శల లక్ష్మిరెడ్డి, తుమ్మలూరు వీరారెడ్డి, ఎస్.శిలార్ అహ్మద్, శ్రీరాములు, ఎస్ సాంబశివ. కూనాసి నాగరాజు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న రైతు నాయకులు, రైతులు

## రేపు వాహనాలకు వేలం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

జమ్మలమడుగు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 7న వేలం నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. కడప సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఆధార్, ఏదైన ప్రూఫ్ తీసుకొనిరావాలని ఆమె సూచించారు.

## ఎర్రగుంట్లలో ఉచిత మజ్జిగ పంపిణీ

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు చంద్రగిరి రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలకు వడదెబ్బ తగలకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూడు నెలలుగా ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు నాగయ్య, మల్లు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, రాజంపేట.**

**O.S.No. 124/2022**

1. ఇనుకొండు క్రిష్ణమూర్తి, తండ్రి ఐ.చెన్నయ్య, వయస్సు 60 సం॥లు, హిందు, నివాసం డోర్‌నెం.36/256-24-17-1, మానస కళ్యాణ మండపం వీధి ఎదురుగా, H/o చిన్నచౌకు, కడప సిటి, ఆధార్ నెం.8347 0638 0414.
2. ఇనుకొండు మల్లికార్జున, తండ్రి ఐ.చెన్నయ్య, రెప్రెజెంటెడ్ బై శ్రీమతి అర్చన, (భర్త మల్లికార్జున గల్ఫ్‌లో వున్నందున) వయస్సు 46 సం॥లు, హిందు, నివాసం డోర్‌నెం.2/673-1, నాగరాజుపేట, కడప. **...వాదులు**

**Vs**

1.ఐ.శివప్రసాద్, తండ్రి ఐ.ఆదినారాయణ, వయస్సు 40 సం॥లు, హిందు.
2. శ్రీమతి ఐ.గోపాలమ్మ, భర్త ఐ.ఆదినారాయణ, వయస్సు 70సం॥లు, హిందుకులం, వీరి ఇరువురి నివాసం డోర్‌నెం. 7/105-1, ఎన్జీఓ కాలనీ, H/o చిన్నచౌకు, కడప సిటి-2. **...ప్రతివాదులు**

**ప్రతివాదులకు సమను**

పై కనిన వాదులు పై కేసులో కనిన కేసులో కనిన షెడ్యూలు పైన భాగపరిష్కారం కోరుచు పై కనిన ప్రతివాదుల పైన సివిల్ వ్యాజ్యం దాఖలు చేయడం జరిగినది. కనుక పై కనిన ప్రతివాదులు పై కనిన కోర్టులో తేది:23.06.2023న ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరు కాని పక్షంలో మీ పరోక్షమున తీర్మాణం చేయుదురని ఇందుమూలకంగా తెలియజేయుచున్నాము.

**//కోర్టువారి ఉత్తర్వుల మేరకు//**

**ఎమ్.సుధాకర్ బాబ్జీ,**
**అడ్వకేట్, కడప.**

**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, రాజంపేట.**

**I.A.No. 428/2022**
**O.S.No. 124/2022**

1. ఇనుకొండు క్రిష్ణమూర్తి, తండ్రి ఐ.చెన్నయ్య, వయస్సు 60 సం॥లు, హిందు, నివాసం డోర్‌నెం.36/256-24-17-1, మానస కళ్యాణ మండపం వీధి ఎదురుగా, H/o చిన్నచౌకు, కడప సిటి, ఆధార్ నెం.8347 0638 0414.
2. ఇనుకొండు మల్లికార్జున, తండ్రి ఐ.చెన్నయ్య, రెప్రెజెంటెడ్ బై శ్రీమతి అర్చన, (భర్త మల్లికార్జున గల్ఫ్‌లో వున్నందున) వయస్సు 46 సం॥లు, హిందు, నివాసం డోర్‌నెం.2/673-1, నాగరాజుపేట, కడప. **...పిటిషనర్స్/వాదులు**

**Vs**

1.ఐ.శివప్రసాద్, తండ్రి ఐ.ఆదినారాయణ, వయస్సు 40 సం॥లు, హిందు.
2. శ్రీమతి ఐ.గోపాలమ్మ, భర్త ఐ.ఆదినారాయణ, వయస్సు 70సం॥లు, హిందుకులం, వీరి ఇరువురి నివాసం డోర్‌నెం. 7/105-1, ఎన్జీఓ కాలనీ, H/o చిన్నచౌకు, కడప సిటి-2. **...రెస్పాండెంట్స్/ప్రతివాదులు**

**రెస్పాండెంట్స్‌లకు/ప్రతివాదులకు నోటీసు**

పై కనిన పిటిషనర్లు/వాదులు పై కేసులో కనిన కేసులో కనిన షెడ్యూలు పైన భాగపరిష్కారం కోరుచు పై కనిన ప్రతివాదుల పైన సివిల్ వ్యాజ్యం దాఖలు చేయడం జరిగినది. కనుక పై కనిన రెస్పాండెంట్స్/ప్రతివాదులు పై కనిన కోర్టులో తేది:23.06.2023న ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరు కాని పక్షంలో మీ పరోక్షమున తీర్మాణం చేయుదురని ఇందుమూలకంగా తెలియజేయుచున్నాము.

**//కోర్టువారి ఉత్తర్వుల మేరకు//**

**ఎమ్.సుధాకర్ బాబ్జీ,**
**అడ్వకేట్, కడప.**